మెట్ల బావులకు సొబగులు

బావుల పునరుద్ధరణ షురూ • సాహె సంస్థ నిర్వాహకురాలు కల్పన రమేష్

మణికొండ: హైదరాబాద్ నగర చరిత్ర, కళా వైభవం, పురావస్తు నిర్మాణాలు, ఆచారాలకు కేంద్రాలుగా మెట్ల బావులు నిలుస్తాయని సాహె స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు కల్పన రమేష్ అన్నారు. వాటిని పునరుద్ధరించి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. గండిపేట మండలం మంచిరేవుల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో పూడుకుపోయిన మెట్ల బావిని దాతల సహకారంతో పునరుద్ధరించే పనులను చేపడతామన్నారు. వీటిని సోసియో కల్చర్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని ఆమె వెల్లడించారు. గతంలో దేవాలయాల వద్ద పుష్కరిణులు తప్పనిసరిగా ఉండేవని, కాలక్రమంలో అవి పూడుకుపోయాయన్నారు. వాటిని పునరుద్ధరించుకుని జలభాండాగారాలుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకుడు డి.లక్ష్మణ్, పురావస్తు పరిశోధకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, సుధా, కార్తీక్, అర్చకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్ల బావికి ఏర్పాటు చేసిన లైటింగ్, నిర్వహించిన గంగాహారతి, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.


మెట్ల బావిని ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు


సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు,


సాంస్కృతిక కార్యక్రమాలు


గంగాహారతి ఇస్తున్న అర్చకులు

క్రికెట్ టోర్నీలో సత్తాచాటిన యువత


క్రీడాకారులను అభినందిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. శ్రీ రాఘవేంద్ర స్పోర్ట్స్ ఎస్టేట్ అండ్ పీకే స్పోర్ట్స్ అకాడమీకి చెందిన క్రీడాకారులు న్యూజిలాండ్ క్రికెట్ సీరీస్–2024కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం క్రీడాకారులను ఆమె అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు బెంగళూర్, అనంతపురంలో పోటీలు జరుగుతాయన్నారు. మూడు వన్‌డే మ్యాచ్‌లు ఆడనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్తమ శిక్షణ తీసుకొని పోటీల్లో రాణించి విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోచ్ ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం


కాటేదాన్ చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలపై ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాటేదాన్ చౌరస్తాలో బీసీడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు జి.ఎం.కురుమయ్య అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని చేపట్టి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ మాట్లాడుతూ... అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు స్వామి, వెంకటయ్య, తిరుమల్, బీసీడబ్ల్యూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



బండ్లగూడ: విద్యార్థులు చక్కగా చదువుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి అన్నారు. హైదర్షాకోట్ ప్రాంతానికి చెందిన రుద్రాశ్రీ పుల్లమ్మ తన భర్త రుద్రాక్ష సీతారాములు జ్ఞాపకార్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 25 మంది విద్యార్థులకు సైకిళ్లను బహుమతిగా అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి మాట్లాడుతూ... 8, 9, 10వ తరగతులలో చదువుతున్న విద్యార్థులు చాలా దూరం నుంచి నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి 25 మందికి సైకిళ్ల విరాళంగా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యువనేత టింకు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరం

మోతీనగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ బంజారా హిల్స్ శాఖ, జెన్‌నెక్స్ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం గాయత్రినగర్‌లోని పాఠశాల ఆవరణలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కేల వెంకటరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు విద్యార్థులతో పాటు పరిసర ప్రాంత వాసులు అందరూ ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం


చల్లా వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న నాగేందర్‌రెడ్డి

అత్తాపూర్: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగుతున్నామని ఎన్‌ఎస్‌యూఐ రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి అన్నారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా వంశీచంద్‌రెడ్డిని శుక్రవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారంలో తమదైన శైలిలో ముందుకు వెళ్తున్నామన్నారు. యువజన కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా అహర్నిశలు పాటుపడుతున్నామన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తున్నామన్నారు.

గురుకుల విద్యా సంస్థల్లో చేరండి

ఐదో తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష


సుజాత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2025–26వ విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు నార్సింగి పాఠశాల ప్రిన్సిపాల్ పి.సుజాత వెల్లడించారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు డిసెంబర్ 21వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024–25వ విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. నాలుగో తరగతి చదువుతున్నట్లుగా ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. 2025 ఫిబ్రవరి 23న గురుకుల విద్యా సంస్థల్లో 5వ తరగతి ప్రవేశాలకు ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ సుజాత వెల్లడించారు. విద్యార్థులు తమ దరఖాస్తులను http://tgcet.cgg.gov.in వెబ్‌సైట్‌లో సమర్పించాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలని రాస్తారోకో


ఆరె మైసమ్మ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

బండ్లగూడ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరె మైసమ్మ చౌరస్తా వద్ద సీపీఐ నాయకులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. పార్టీ స్థానిక నేత డప్పు ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మండల కన్వీనర్ జాజాల రుద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్లమెంటు సాక్షిగా అమిత్‌షా ఈ తరహా వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని... దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నాయకుడు ఎం.అశోక్, సీఐటీయూ రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు బచ్చలకూర స్వామి, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, నాయకులు సుభాష్, నర్సింహ, రాము, మల్లయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్యం అందించాలి


మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్రంలోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ నగదు రహిత హెల్త్ కార్డులు అందించాలని... ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార చేనేత అండ్ జౌళీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ... రాష్ట్రం, దేశంలో వ్యవసాయ సమాజాన్ని అభివృద్ధి చేయడానికి విశ్వ విద్యాలయం విభిన్న సాంకేతికతలు, రకాలు, సలహాలను అందజేస్తున్నందున, వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పని చేయడం గర్వ కారణమన్నారు. మానవ జీవితానికి ఆరోగ్యం చాలా ముఖ్యమని... ఆస్పత్రుల్లో వివిధ రకాల వైద్య చికిత్సల కోసం భారీ మొత్తంలో వసూలు చేయడంలో ఆస్పత్రుల బిల్లు కట్టలేని పరిస్థితిలో ఉద్యోగులు, పింఛన్‌దారులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ విషయంలో రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీలోని టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, పీజేటీఏయూలోని టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, పింఛన్‌దారులందరికీ నగదు రహిత హెల్త్ కార్డులను అందించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ యాదవ్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోకాపేటను హడలెత్తించిన బ్లాస్టింగ్

- పేలుళ్ల ధాటికి ఎగిసిపడిన బండరాళ్లు
- ధ్వంసమైన పలు వాహనాలు
- నార్సింగి పోలీసులకు స్థానికుల ఫిర్యాదు


డిటోనేటర్లు ఏర్పాటు చేసి పేల్చివేసిన ప్రాంతం

మణికొండ: బండరాళ్లను తొలగించే పనుల్లో భాగంగా ఏకంగా పెద్ద ఎత్తున డిటోనేటర్లను ఏర్పాటు చేసి వాటి బ్లాస్టింగ్‌లు నిర్వహించటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాలివీ... నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట నియోపోలీస్‌లో ఇటీవల వేలంలో భూములను దక్కించుకున్న పలు సంస్థలు నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఆ ప్రాంతం రాళ్ల గుట్టలతో నిండి ఉండటంతో వాటిని తొలగించేందుకు బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. అవి కాస్తా శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించడంతో బండరాళ్లు ఎగిరి చాలా దూరం పడ్డాయి. శబ్దాలకు సమీపంలో ఉన్న అయ్యప్ప స్వాముల శిబిరంలో ఉన్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. పేలుళ్లకు సమీపంలో ఉన్న ప్రాంతానికి రాళ్లు ఎగిరి పడటంతో పలువురికి గాయాలయ్యాయి. బండరాళ్లు ఎగిరి వచ్చి పలు వాహనాలపై పడటంతో అవి కూడా ధ్వంసం అయ్యాయి. బండరాళ్లు ఎగరటం చూసి అటుగా వెళ్తున్న వారు ముందుగా సినిమా షూటింగ్‌గా భావించారు. తరువాత తేరుకుని వాస్తవం తెలుసుకున్న స్థానికులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. బ్లాస్టింగ్ నిర్వహించేందుకు అనుమతులు ఉన్నాయా.. ఉంటే చుట్టు పక్కల వారికి ఇబ్బంది కలిగేలా నిర్వహించటం చట్ట విరుద్ధమని.. వారిపై చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న నార్సింగి ఇన్‌స్పెక్టర్

ఇండియన్ ఇంజనీరింగ్ కాంగ్రెస్‌లో 'ఎస్కీ' స్టాల్

రాయదుర్గం: దేశవ్యాప్తంగా 'ఎస్కీ' పనితీరు వివరిస్తామని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. కోల్‌కతాలో శుక్రవారం ప్రారంభమైన 39వ ఇండియన్ ఇంజనీరింగ్ కాంగ్రెస్‌లో 'ఎస్కీ' స్టాల్‌ను పశ్చిమబెంగాల్ విద్యుత్ శాఖ మంత్రి అరూప్ బిస్వాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామేశ్వరరావు ఫోన్‌లో వివరాలు అందజేశారు. జాతీయస్థాయిలో జరిగే కార్యక్రమాలలో ప్రత్యేక స్టాళ్ళను ఏర్పాటు చేసి 'ఎస్కీ'లో అందించే శిక్షణ, అందుబాటులోకి తీసుకొచ్చిన పీజీ, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు, త్వరలో ప్రారంభించే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను వివరించడం జరుగుతుందన్నారు.




కారులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

శంషాబాద్ రూరల్: కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసుల సమాచారం మేరకు... ఖమ్మంకు చెందిన భానుతేజ రెడ్డి(25), వరంగల్‌కు చెందిన రాజ్‌కుమార్(26) నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటారు. వీరు మారుతి కారులో శుక్రవారం బెంగుళూరు నుంచి హైదరాబాద్ వస్తున్నారు. తొండుపల్లి వద్ద పోలీసులు కారును ఆపి తనిఖీ చేయగా.. వారి వద్ద ఉన్న 70 గ్రాముల గంజాయి దొరికింది. వీరు గంజాయిని సేవించడమే కాకుండా విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'అక్రమ కేసులకు భయపడం'

రాయదుర్గం: అక్రమ కేసులకు ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ నాయకులు భయపడరని ఆ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా స్పష్టం చేశారు. ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ సభ్యులను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని విమర్శించారు. కలిసి కట్టుగా ప్రభుత్వంపై పోరాడతామన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలీసుల సమాచారం మేరకు... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రగతినగర్ కాలనీ సెప్టిక్ ట్యాంక్ ప్రాంతంలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా 25–30 సంవత్సరాల యువకుడు మృతి చెంది పడి ఉన్నాడన్నారు. స్థానికంగా భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని పోలీసులు పేర్కొన్నారు. చలి, అనారోగ్య సమస్యల కారణంగా చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశాల రాష్ట్ర బస్సు జాతాను జయప్రదం చేయాలి


బస్సు జాతా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి చేపట్టిన రాష్ట్ర బస్సు జాతా ఈ నెల 30వ తేదీన రంగారెడ్డి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ఆశా వర్కర్లంతా కృషి చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా ఆశావర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు జి.కవిత కోరారు. ఈ మేరకు కాటేదాన్ కార్యాలయంలో ఆశా వర్కర్ల బస్సు జాతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలోని ఆశాలు అందరూ తరలివచ్చి జాతాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నిర్మల, భాగ్య, శోభ, నవనీత, సంధ్య, ఆశా జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మైలార్‌దేవ్‌పల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానం అని మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి అన్నారు. ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన 150 మంది అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా ఆస్పత్రి డాక్టర్లు యు.శ్రీలత, డాక్టర్ సాయిసంధ్య, డాక్టర్ ప్రణిత, డాక్టర్ శ్రావ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ వీరేంద్ర పాటిల్, డాక్టర్ మధుసూదన్, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వైద్యులు

బాలిక కిడ్నాప్, రేప్... హత్యాయత్నం కేసులో ఇద్దరికి జీవిత ఖైదు


జీవిత ఖైదు పడిన షేక్ జాఫర్, షేక్ నయీం

అత్తాపూర్: బాలికను కిడ్నాప్, రేప్ చేసి హత్యాయత్నం చేసిన కేసులో ఇద్దరు నేరస్తులకు కోర్టు జీవిత ఖైదు విధించింది. పోలీసుల సమాచారం మేరకు... ఆరాంఘర్ ప్రాంతంలో ఒక మైనర్ బాలికను షేక్ జాఫర్, షేక్ నయీమ్‌లు కిడ్నాప్ చేశారు. అనంతరం ఆ బాలికను రేప్ చేసి హత్య చేసేందుకు యత్నించారు. అప్పటి రాజేంద్రనగర్ పోలీసులు ప్రస్తుతం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో ఎల్‌బీనగర్ కోర్టులో న్యాయమూర్తి పి.అంజనేయులు కేసు పూర్వాపరాలు పరిశీలించి నిందితులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ. 16 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ నేర విచారణలో భాగమైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వెంకటేశ్వరరెడ్డి, పరిశోధన అధికారి అశోక్ చక్రవర్తి, ఏసీపీ, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, ఉన్నతాధికారులు అభినందించారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి


నిరసన తెలుపుతున్న నాగేందర్‌రెడ్డి

అత్తాపూర్: పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే తమ పదవికి రాజీనామా చేసి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం ఆయన అంబేడ్కర్ చిత్రపటంతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... డాక్టర్ అంబేడ్కర్ ఒక వర్గం కోసం పాటుపడిన వ్యక్తి కాదని యావత్ దేశ ప్రజల అభ్యున్నతి కోసం కష్టపడిన మహనీయులని గుర్తు చేశారు. అలాంటి మహనీయుడిని అవమానించేలా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. అమిత్‌షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

PUBLIC NOTICE

This is to inform and notified to general public that my client Tanda Srikanth Goud S/o T. Vittal Goud, R/o. Plot No.11, Richwod, Ootpally Village, Shamshabad Mandal, Ranga Reddy District and Kandimalla Venu Babu S/o. Prasada Rao, R/o. H.No.1-52B, Main Bazar, Martur mandal, Kollapudi, Prakasham, AP. intends to purchase the farm site No.827, in survey No.89, of Amit park, Sector-I, admeasuring 333.3 out of 500 sq yards or 418 sq mtrs, situated at Peddashapur, Village & GP, Shamshabad Mandal, RR Dist. That any person or persons, firms, financial institutions, banks has got any right, title, authority, claims or interest whatsoever of any nature in respect of the above said immoveable property. He/they shall inform the same to the undersigned together with all relevant documents within seven days from the date of this publication, failing which my client shall proceed with the completion of the sale transaction towards registration said property to obtain the sale deed and the objections/claims of any nature thereafter shall not be entertained.

M/s. Dr. P. NAGESH, Smt. P. PUSHPAMALA
P. RAJESHWAR RAO, B. SHANKER
ADVOCATES
O/o. H.No.1-34, Block "A", S-213, Green Gold Apartments, Malkajgiri, Hyd-47.
Mobile No. 9394755591